బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రికి వినతి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న మల్లేశ్

భూదాన్ పోచంపల్లి, జనవరి 3 : పర్యాటక కేంద్రమైన పోచంపల్లి మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్ సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. పోచంపల్లి నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు రెండు షటిల్ బస్సులు, ఉప్పల్ డిపోకు చెందిన బస్సు పెద్దరావులపల్లి వరకు, దిల్‌సుఖ్‌నగర్ నుంచి వయా కనుముక్కుల గ్రామం మీదుగా సంగెం వరకు, యాదగిరిగుట్ట డిపో నుంచి భువనగిరి, మగ్గంపల్లి, బట్టుగూడెం, పెద్దరావులపల్లి, రేవణపల్లి కనుముక్కుల, చౌటుప్పల్ వరకు బస్సు కొనసాగించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంబరీశ్‌రెడ్డి ఉన్నారు.

గ్రామీణ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి ప్రశంసనీయం

- గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును సందర్శించిన అధికారుల బృందం

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో పరిశీలిస్తున్న విదేశీ అధికారులు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 3 : గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి ప్రశంసనీయమని నేషనల్ డిఫెన్స్ కాలేజ్ అధికారులు అన్నారు. ఫిబ్రవరి 3నుంచి 7వరకు జాతీయ భద్రతా వ్యూహాత్మక అధ్యయనాల ప్రయాణంలో భాగంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ కళాశాల ఇన్‌చార్జి జనరల్ సామర్ద్ నాగర్ ఆధ్వర్యంలో అమెరికా, ఇరాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఒమన్, పిలిప్పీన్స్ దేశాల ప్రతినిధులు 16 మంది మండలంలోని దండు మల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన పరిశ్రమల గురించి టీఐఎఫ్ ఎంఎస్ఎంఈ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణానికి హాని కలుగని పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం పట్ల ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. ఎకో ఫ్రెండ్లీ విధానాన్ని కొనియాడారు. ఇలాంటి సుస్థిర అభివృద్ధిని నేడు ప్రపంచం కోరుకుంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ హరికృష్ణ పాల్గొన్నారు.

సాగునీరు ఇవ్వాలని రైతుల నిరసన

చల్లూరు మల్లాయి చెరువులో నిరసన తెలుపుతున్న రైతులు

రాజాపేట, ఫిబ్రవరి 3 : కాళేశ్వరం జలాలతో మండలంలోని గొలుసుకట్టు చెరువులు నింపి సాగుజలాలు అందించాలని జలసాధన సమితి ఆధ్వర్యంలో చల్లూరు మల్లాయి చెరువులో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జలసాధన సమితి మండల కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్ మాట్లాడుతూ మండలంలో ఉన్న 13చెరువులు, 32 కుంటలు నీళ్లు లేక వట్టిపోయి ఉన్నాయన్నారు. దాంతో భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు, బావులు పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి తలాపున పారుతున్న కాళేశ్వరం జలాలను అందించి అన్నదాతలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు సట్టు తిరుమలేశ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, కాకాల ఉపేందర్, కుమ్మరి లక్ష్మణ్, రమేశ్, గోపిరెడ్డి, ఉప్పలయ్యగౌడ్, యమ్మ భాస్కర్, దాసు, రైతులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

- మోత్కూరు మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్

మోత్కూరు, ఫిబ్రవరి 3 : మున్సిపాలిటీ పరిధిలోని ఇండ్లు, షాపుల నుంచి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ కె.సతీశ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్నందున పట్టణ పరిధిలో షాపుల నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు, పన్నులను వసూలు చేయాలన్నారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులను వంద శాతం వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'10న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3 : తిరోగమన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశాభివృద్ధికి, ప్రజల జీవితాలకు, శ్రామికుల బతుకుదెరువుకు శాపంగా ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు, బడా బాబులకు అనుకూలంగా ఉన్నదని పేర్కొన్నారు. నూతన ఆర్థిక విధానాలను మరింత ప్రమాదకరంగా అమలు జరిపేందుకు ఈ బడ్జెట్ ప్రోత్సాహకరంగా ఉందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు సమీపంలో నిర్వహిస్తున్న మహాధర్నాలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు జెల్లెల పెంటయ్య, గంగాదేవి సైదులు, రాములమ్మ, అంజయ్య, స్వామి, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలకు నిధులు కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. రాష్ట్రంలోని 8మంది బీజేపీ ఎంపీల చేతగానితనానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కూర వెంకటేశ్, వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, రవికుమార్, నర్సింహ, సలావుద్దీన్, వెంకటేశ్వర్లు, రాజు, నరేశ్, బాలయ్య, లయక్ అహ్మద్ పాల్గొన్నారు.

పాతగుట్టలో అధ్యయనోత్సవాలకు శ్రీకారం

- తిరుమంజనం, తొళక్కంతో ప్రారంభమైన ఉత్సవాలు

పాతగుట్టలో అధ్యయనోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయంగా ఉన్న పాతగుట్ట (పూర్వగిరి) లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నాలుగు రోజులపాటు జరిగే అధ్యయనోత్సవాలకు సోమవారం ప్రధానార్చక బృందం శ్రీకారం చుట్టింది. ప్రత్యేక సేవపై స్వామి, అమ్మవార్లతో ఆళ్వార్ స్వాములను అలంకరించారు. ఆలయంలో నిత్య ఆరాధనల అనంతరం తిరుమంజన మహోత్సవం పాంచరాత్రాగమ సాంప్రదాయ రీతిలో ప్రధానార్చకులు, అర్చకులు, పారాయణికులు, వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తొళక్కంతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయం మండపంలో సేవకు అర్చకులు, పారాయణికులు, రుత్విక్కులు వేద పారాయణాలను ఆలపించారు. సాయంత్రం దివ్యప్రబంధంతో పాటు పుర ప్పాట్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ఏఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకుడు నల్లన్‌థీఘుళ్ లక్ష్మీనరసింహాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న విదేశీ బృందం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని జాతీయ రక్షణ కళాశాల అకాడమీ ఇన్‌చార్జి మేజర్ జనరల్ సామర్ద్ నాగర్ ఆధ్వర్యంలో వివిధ దేశాలకు చెందిన 16 మంది ప్రతినిధులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

- చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

రాజాపేట : దూది వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

తుర్కపల్లి, ఫిబ్రవరి 3 : వసంత పంచమి వేడుకలను సోమవారం మండల కేంద్రంలోని పడాల ముత్యాలు మెమోరియల్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవికి పూజలు నిర్వహించి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పడాల చంద్రం, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని బ్రిలియంట్, సరస్వతి విద్యాలయాల్లో చిన్నారులకు పురోహితులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ పావనీకోటేశ్వరి, పంజాల నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

చౌటుప్పల్ : పట్టణంలోని ట్రినిటీ పాఠశాలలో సోమవారం 211 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ఓనమాలు దిద్దించారు. అంతకుముందు సరస్వతి విగ్రహానికి పూజలు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవి పూజ నిర్వహించి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కృష్ణవేణి పాఠశాలలో చిన్నారులు సరస్వతి వేషధారణలతో అలరించారు. కరస్పాండెంట్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.యాదగిరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు..

బీబీనగర్ : వసంత పంచమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని 5, 6 అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా సరస్వతి దేవికి పూజలు నిర్వహించి తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పిల్లలతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ కె.నర్సింహారావు, అంగన్‌వాడీ టీచర్లు పి.విజయలక్ష్మి, ఎం.రజిత పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని దూది వెంకటాపురం గ్రామంలో గల రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా గాదభిక్షపతి 20మంది పిల్లలకు పలకలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, వసంత, ఆశ వర్కర్లు నిర్మల, స్వరూప, హెల్పర్ అరుణ పాల్గొన్నారు.

వంగపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 3 : మండలంలోని వంగపల్లి రైల్వే ఫ్లాట్‌ఫాం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. వంగపల్లి రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫాం నంబర్ 2 వద్ద కాలినడక వంతెన సమీపంలో సుమారు 55 ఏండ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం పడి ఉందని సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఆ వ్యక్తి తెల్లని చొక్కా, నల్ల గీతల ప్యాంట్, తెలుపు, నలుపు చలి కోటు ధరించి ఉన్నాడు. 5.5 అడుగుల ఎత్తు, గడ్డం, జుట్టుతో ఉన్న అతని చాతిపై ఎడమ, కుడి వైపున పుట్టు మచ్చలు ఉన్నాయని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9848222169, 871256854 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'చల్లూరు గోశాలలో అక్రమాలపై విచారణ చేపట్టాలి'

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3 : రాజాపేట మండలం చల్లూరు గ్రామ పరిధిలోని సహయోగ్ గోశాలలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీసీపీ రాజేశ్‌చంద్రకు భజరంగ్‌దళ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లా పరిధి నుంచి అక్రమంగా తరలిస్తున్న గోవులను గోరక్షకులు పలుమార్లు పట్టుకుని చల్లూరు గోశాలకు తరలించామని చెప్పారు. గోశాలపై విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో భజగరంగ్‌దళ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సందీప్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీశైలం, నాయకులు రవీందర్, వేణు, ప్రసాద్, భరత్‌కుమార్, నవీన్, బాలరాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : మండలంలోని పెంచికల్‌పహాడ్ గ్రామ పరిధిలో విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కంసాని కృష్ణ ఆవు రోజు మాదిరిగా పెంచికల్‌పహాడ్ గ్రామ సమీపంలో మేస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి కుప్పకూలింది. గమనించిన బాధితుడు విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేశాడు. ఆవు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపాడు

ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మహేశ్

రాజాపేట ఫిబ్రవరి 3 : మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎంఈఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కాల్వపల్లికి చెందిన ఇంజ మహేశ్ మాదిగను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్రప్రసాద్ మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న సోమవారం హైదరాబాద్‌లో నియమించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగలు డప్పుతో తరలి రావాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద శంకర్ మాదిగ

యాదగిరిగుట్ట : పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద శంకర్ మాదిగ

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 3 : ఎస్సీలోని 59 ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాలనే డిమాండ్‌తో ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుల మహా ప్రదర్శనకు ప్రతి మాదిగ సంకన డప్పు వేసుకుని తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద శంకర్ అన్నారు. పట్టణంలో సోమవారం మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏండ్లుగా మంద కృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం ఫలితంగా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించి ఏకసభ్య కమిషన్‌ను నియమించారని తెలిపారు. కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని చేస్తున్న ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ, మండలాధ్యక్షుడు ఆకారపు లక్ష్మీనారాయణ, ఎంఎస్‌పీ మండలాధ్యక్షుడు సుంచు ప్రేమ్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొల్లూరి హరీశ్, బోల్లారం నాగరాజు, గోపి నాగరాజు పాల్గొన్నారు.

లక్ష డప్పులు, వెయ్యి గొంతుల పోస్టర్ ఆవిష్కరణ

మోటకొండూర్, ఫిబ్రవరి 3 : హైదరాబాద్‌లో ఈ నెల 7న తలపెట్టిన లక్ష డప్పుల ప్రదర్శన, వెయ్యి గొంతుకల పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బొట్ల నర్సింహ సోమవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలన్నారు. సంఘం మండలాధ్యక్షుడు ఆడెపు శ్రీనివాస్, మండల నాయకులు గణేశ్, మహేందర్, శ్రీనివాస్, నాగరాజు, పాండు, నర్సింహ, బీసీ సంఘం నాయకులు మల్లేశ్ యాదవ్, గణేశ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో లక్ష డప్పులు, వేల గొంతుల పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ప్రదర్శనకు మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్ బోయ రామచంద్రం, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బొడ్డు శ్రవణ్‌కుమార్, మాజీ సర్పంచులు ఊదరి నర్సింహ, యాదయ్య, శ్రీనాథ్, నాయకులు వెంకటేశ్ మహాజన్, రాము పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలో లక్ష డప్పులు, వెయ్యి గొంతుల మహా ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిరంజీవి, నాయకులు మల్లయ్య, శ్రవణ్, రవి, విష్ణు, రాజు, ఆంజనేయులు, లక్ష్మణ్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఆండాలు మృతికి సంతాపం

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 3 : పట్టణంలోని 11వ వార్డుకు చెందిన కాసులబాద ఆండాలు సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆండాలు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మొరిగాడి వెంకటేశ్, నాయకులు పంతం కృష్ణ, జింకల రామకృష్ణ, సారాబు సంతోష్, ఎండీ ఫయాజ్, జూకంటి ఉప్పలయ్య, శశిప్రీతం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మోత్కూరు, ఫిబ్రవరి 3 : మున్సిపాలిటీ పరిధిలోని జామచెట్లబావికి చెందిన నిరుపేద అయిన పంగ యాకయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. జామచెట్లబావి - కొండాపురం వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన 70,616 రూపాయలను బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దబ్బెటి విజయారమేశ్, గ్రామస్తులు బీసు మల్లికార్జున్, శ్రీనివాస్, నర్సింహ, రాంబాబు, నగేశ్, వెంకన్న, భిక్షం, కిరణ్, మల్లేశ్, శోభన్‌బాబు, నరేశ్, నర్సింహ పాల్గొన్నారు.

కిరాణా అసోసియేషన్ కమిటీ

చౌటుప్పల్, ఫిబ్రవరి 3 : పట్టణంలో సోమవారం కిరాణా అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కామిశెట్టి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా లింగాల లింగస్వామి గౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో గోశిక సత్యనారాయణ, వీసం చంద్రారెడ్డి, కామిశెట్టి చంద్రశేఖర్, ఢిల్లీ శంకర్‌రెడ్డి, కామిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

మహాలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 3 : మండలంలోని రహీంఖాన్‌పేటలో మహాలింగేశ్వరస్వామి ఆలయం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర్గు వెంకటేశం, ఉపాధ్యక్షులుగా దుంప పరశురాములు, బూడిద నరేందర్, కార్యదర్శిగా ఎమడాల అంజనేయులు, సలహాదారులుగా మోహన్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, అనంతరెడ్డి ఎన్నికయ్యారు.

మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలి

- కలెక్టర్ హనుమంతరావు

తాసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

వలిగొండ, ఫిబ్రవరి 3 : ప్రభుత్వం పెంచిన 40శాతం మెస్ చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన, ఆరోగ్యవంతమైన సుచి శుభ్రతతో కూడిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ హనుమంతరావు కేజీబీవీ హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని లోతుకుంట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల హాస్టల్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాలలో కోతుల బెడదను నివారించేందుకు సీఎస్ఆర్ కాంపోనెంట్ నిధులతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు సరిపడా బెడ్లను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. హాస్టల్‌లో మెనూ పాటించకుండా అజాగ్రత్తగా ఉండే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు తాసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ధరణిపై సమీక్ష నిర్వహించి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, మండల సర్వేయర్ వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమం పరిశీలన

వృద్ధులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : పట్టణంలోని రాయగిరి సహృదయ అనాథ వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా మానసిక ఆరోగ్య అధికారి ప్రీతిస్వరూప్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. వృద్ధులు, నిర్వాసితులకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. ఉచిత న్యాయ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత సూచించారు.

కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు భానుకుమార్, సురేశ్‌గౌడ్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సామేల్

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, ఫిబ్రవరి 3 : మున్సిపాలిటీలో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం పరిశీలించారు. అనంతరం పాత బస్టాండ్ సమీపంలో రోడ్డు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకన్న, మజీద్, వేణు పాల్